# 'యువగర్జన'కు అన్నీ ప్రత్యేకమే!



యువగర్జన సదస్సు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న తెదేపా నాయకులు

గ్రామీణమంగళగిరి, న్యూస్‌టుడే: తెదేపా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించదలచిన 'యువగర్జన' సదస్సుకు ఏర్పాట్లు కనీవినీ ఎరుగని రీతిలో చేపట్టబోతున్నట్లు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు డాక్టర్ అల్లాడి రాజ్‌కుమార్ చెప్పారు. మండలంలోని కాజ గ్రామపరిధిలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో యువగర్జన సదస్సు ప్రాంగణంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. సదస్సు వేదిక చాలా గంభీరంగా, ఆకర్షణీయంగా ఉంటుందని, ఎంతటి వారైనా ముగ్ధులవుతారన్నారు. ముంబాయి నుంచి డిజిటల్ సౌండ్ ఇంజినీరు వస్తున్నారని చెప్పారు. ప్రతి మాట సుస్పష్టంగా ముందు వరుస నుంచి చివరి వరుస వరకూ వినిపించేలా ప్రత్యేకంగా సౌండ్ సిస్టంను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి వేదిక నిర్మాణం, లైటింగ్ ఏర్పాట్ల నిపుణులు వస్తున్నారని చెప్పారు. వారం రోజుల పాటు తాను ఇక్కడే మకాం చేసి ఈ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఎన్టీఆర్ 1994లో నిర్వహించిన సింహగర్జన ఎంతటి విజయవంతమో అందరికీ తెలిసిందేనన్నారు. ఈ సదస్సు కూడా అంత కంటే విజయవంతమవుతుందని, దాదాపు 15 లక్షల మంది వరకూ రాష్ట్రం నలుమూలల నుంచి తెదేపా నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు రావచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో నందమూరి వారసులంతా పాల్గొంటారని స్పష్టం చేశారు. జూనియర్ ఎన్టీఆర్ ఈ సదస్సుకు దూరంగా ఉంటున్నట్లు మీడియాలో వస్తున్న కథనాల్లో వాస్తవం లేదని రాజ్‌కుమార్ చెప్పారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు బీదా రవిచంద్ర మాట్లాడుతూ ఈ సదస్సుతో యువతలో చైతన్యం పెరుగుతుందని చెప్పారు. ఖాళీగా ఉన్న సుమారు ఐదు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా రాష్ట్రప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు బీదా రవిచంద్రబాబు తొలిసారి వచ్చిన సందర్భంగా ఆ విభాగం మండల అధ్యక్షుడు కోనంకి శ్రీనివాసరావు, పలువురు నాయకులు పూలమాలలతో సత్కరించారు.

యువగర్జన సదస్సు నిర్వహణ ప్రాంణంలో నాలుగురోజులుగా తొలగించిన కంపను ట్రాక్టర్లతో ఎత్తిపోసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సదస్సు ప్రాంగణం కన్వీనర్ మాదల రాజేంద్ర, సర్పంచుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కొల్లి లక్ష్మయ్య చౌదరి, తెదేపా నాయకులు దానబోయిన సుందర్రావు యాదవ్, మన్నెం మార్కండేయులు, వల్లూరి సూరిబాబు, నందం సుబ్బారావు, మానికొండ శివప్రసాద్, కోనంకి శ్రీనివాసరావు, గాదె పిచ్చిరెడ్డి, పల్లబోతుల శ్రీనివాసరావు, పెదబాబు, ఉడతా శ్రీనివాసరావు, చిల్లపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.